సాక్షి సూర్యాపేట

శుక్రవారం । 18 । అక్టోబర్ । 2024



రేషన్ బియ్యం ముఠా అరెస్ట్

రేషన్ బియ్యాన్ని ఇతర రాష్ట్రాలకు తరలిస్తున్న ముఠాను గురువారం వాడపల్లి పోలీసులు పట్టుకున్నారు. - 8లో

సాగర్ సమాచారం



పూర్తిస్థాయి నీటిమట్టం :	590 అడుగులు
ప్రస్తుత నీటి మట్టం	: 590.00 అడుగులు
ఇన్‌ఫ్లో	: 78,997 క్యూసెక్కులు
క్రస్ట్‌గేట్లు	: 32,400 క్యూసెక్కులు
విద్యుదుత్పాదన కేంద్రం ద్వారా	: 29,557 క్యూసెక్కులు
కుడికాల్వ ద్వారా	: 8,067 క్యూసెక్కులు
ఎడమకాల్వ ద్వారా	: 6,173 క్యూసెక్కులు
ఏఎమ్మార్పీకి	: 2,400
వరద కాల్వకు	: 400

మూసీ సమాచారం



పూర్తిస్థాయి నీటి మట్టం :	645 అడుగులు
ప్రస్తుత నీటి మట్టం :	644.30 అడుగులు
ఇన్‌ఫ్లో	: 1,390 క్యూసెక్కులు
అవుట్‌ఫ్లో	: 771 క్యూసెక్కులు
ఎడమకాల్వకు	: 146 క్యూసెక్కులు
కుడికాల్వకు	: 243 క్యూసెక్కులు

న్యూస్‌రీల్

సూర్యాపేట జిల్లా కోర్టు న్యాయమూర్తులు బదిలీ

చివ్వెంల(సూర్యాపేట) : జిల్లా కోర్టు ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి, మొదటి అదనపు జూనియర్ సివిల్ జడ్జి గురువారం బదిలీ అయ్యారు. ఈ మేరకు హైకోర్టు ఉత్తర్వులు జారీ చేసింది. ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జిగా పనిచేస్తున్న కామిశెట్టి సురేష్ పదోన్నతిపై కోదాడ కోర్టు సీనియర్ సివిల్ జడ్జిగా వెళ్లారు. సికింద్రాబాద్ మెట్రో పాలిటియన్ మెజిస్ట్రేట్‌గా పనిచేస్తున్న గోపు రజిత ఇక్కడికి రానున్నారు. అదేవిధంగా మొదటి అదనపు జూనియర్ సివిల్ జడ్జిగా ఇక్కడ పనిచేస్తున్న జె.ప్రశాంతి బదిలీపై మల్కాజ్‌గిరి కోర్టుకు రెండో అదనపు జూనియర్ సివిల్ జడ్జిగా బదిలీపై వెళ్లారు. మిర్యాలగూడ కోర్టు సెకండ్ అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జిగా పని చేస్తున్న నాగూరి అపూర్వరవళి మొదటి అదనపు జూనియర్ సివిల్ జడ్జిగా సూర్యాపేట జిల్లా కోర్టుకు రానున్నారు. కాగా ఆమెకు నెల రోజులపాటు శిక్షణ ఉండడంతో నవంబర్ 18న బాధ్యతలు స్వీకరించనున్నారు. అప్పటివరకు గోపు రజిత ఇన్‌చార్జ్ బాధ్యతలు చేపట్టనున్నారు.

సేంద్రియ వ్యవసాయంపై దృష్టి సారించాలి



బేతవోలులో వరిపొలాలను పరిశీలిస్తున్న డీఏఓ శ్రీధర్‌రెడ్డి, ఏఓ

చిలుకూరు: రైతులు సేంద్రియ వ్యవసాయంపై దృష్టి సారించాలని జిల్లా వ్యవసాయ అధికారి శ్రీధర్‌రెడ్డి అన్నారు. గురువారం చిలుకూరు మండలంలోని బేతవోలు గ్రామంలో వరి పొలాలను స్థానిక వ్యవసాయ అధికారులు, కేవీకే శాస్త్రవేత్తలు, రైతులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా శ్రీధర్‌రెడ్డి మాట్లాడుతూ వరి సాగులో చీడ పురుగుల నివారణకు రైతులు వ్యవసాయ అధికారుల సూచనలు పాటిస్తూ తక్కువ పెట్టుబడితో అధిక దిగుబడులు సాధించాలన్నారు. వరి సాగులో అవసరం మేరకే ఎరువులు, పురుగు మందులు పిచికారీ చేయాలన్నారు. వాతావరణంలో వస్తున్న మార్పులకు అనుగుణంగా అధికారుల సూచనలు పాటిస్తూ వరి సాగు చేయాలని సూచించారు. అనంతరం వరి సాగులో రైతులు తీసుకోవాల్సిన జాగ్రత్తలను తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి శ్రీధర్, ఏఈఓలు చంద్రశేఖర్, కేవీకే శాస్త్రవేత్తలు కిరణ్, ఆదర్శ, రైతులు నాగేశ్వరరావు, శ్రీను, వీరస్వామి, ప్రభాకర్‌రెడ్డి, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

తహసీల్దార్‌కు పురస్కారం



జక్కర్తి శ్రీనివాసులుకు పురస్కారం అందజేస్తున్న గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ

అర్వపల్లి: వివిధ రంగాల్లో విశిష్ట సేవలందించిన వారికి గురువారం హైదరాబాద్‌లోని రాజ్‌భవన్‌లో ఫెడ్ సంస్థ ఆధ్వర్యంలో ప్రతిభా పురస్కారాలు అందజేశారు. అందులో భాగంగా జిల్లాలోని జాజిరెడ్డిగూడెం మండల తహసీల్దార్ జక్కర్తి శ్రీనివాసులుకు ప్రతిభా పురస్కారాన్ని గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ అందించారు. దివ్యాంగుడు అయినప్పటికీ వీల్ చైర్‌పై విధులు నిర్వర్తిస్తూ, క్షేత్రస్థాయికి వెళ్తూ భూ సమస్యల పరిష్కారంతోపాటు అనేక సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరిస్తుండడంతో ప్రతిభా పురస్కారానికి ఫెడ్ సంస్థ ఆయనను ఎంపిక చేసింది. కార్యక్రమంలో సంస్థ చైర్మన్ ఎం.గంగారాం, నిర్వాహకులు పాల్గొన్నారు.

గ్రంథాలయ అభివృద్ధికి కృషి

మోతె : గ్రంథాలయ అభివృద్ధికి కృషి చేస్తామని జిల్లా గ్రంథాలయ అధికారి శ్యాంసుందర్‌రెడ్డి అన్నారు. మోతె మండల కేంద్రంలోని శాఖా గ్రంథాలయాన్ని గురువారం జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి డి.బాలమ్మతో కలిసి ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా గ్రంథాలయంలో నెలకొన్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. సంస్థ కార్యదర్శి బాలమ్మ మోతె గ్రంథాలయ పరిస్థితిని జిల్లా అధికారికి వివరించారు. గ్రంథాలయ భవనం శిథిలావస్థకు చేరడంతో గ్రామ పంచాయతీ కార్యాలయంలోకి మార్చామన్నారు. గ్రామ పంచాయతీ సిబ్బంది గ్రంథాలయాన్ని ఖాళీ చేయాలని కోరుతున్నారని పేర్కొన్నారు. గత ప్రభుత్వ హయాంలో నూతన గ్రంథాలయ భవన నిర్మాణానికి నిధులు మంజూరయ్యాయని, అనంతరం నిధులు వెనక్కి వెళ్లిపోయాని వివరించారు. కార్యక్రమంలో గ్రంథాలయ సిబ్బంది కుంట లింగారెడ్డి తదితరులు పాల్గొన్నారు.



ర్యాలీ నిర్వహిస్తున్న ప్రైవేట్ డిగ్రీ, పీజీ కళాశాలల యాజమాన్యం

ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు చెల్లించాలి

సూర్యాపేటటౌన్ : ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను తక్షణమే చెల్లించాలని కోరుతూ జిల్లా కేంద్రంలోని ప్రైవేట్ డిగ్రీ, పీజీ కళాశాలల యాజమాన్యం ఆధ్వర్యంలో గురువారం సూర్యాపేట పట్టణంలో బైక్ ర్యాలీ నిర్వహించారు. అనంతరం కలెక్టర్ తేజస్ నంద్‌లాల్ పవార్‌కు వినతి పత్రం అందజేశారు. ప్రైవేట్ డిగ్రీ, పీజీ కళాశాలల మేనేజ్‌మెంట్ అసోసియేషన్ ఎంజీయూ అనుబంధం జిల్లా జనరల్ సెక్రటరీ సైదారావు, ఎంజీయూ కమిటీ సభ్యుడు తీకుళ్ల శ్రీనివాస్ రెడ్డి, వివిధ కళాశాలల యజమానులు పాల్గొన్నారు.

మిల్లర్లకు సన్నాలు లేనట్టే!

- సేకరించిన ధాన్యం గోదాములకు తరలించాలని ప్రభుత్వ నిర్ణయం
- గోదాముల పరిస్థితిపై జిల్లా యంత్రాంగం ఆరా
- ఈ సీజన్‌లో సన్నధాన్యం సేకరణ లక్ష్యం 1.71 లక్షల మెట్రిక్ టన్నులు



ఆత్మకూర్ (ఎస్) మండలం నంద్యాలవారిగూడెంలో గోదామును పరిశీలిస్తున్న ఆర్డీఓ (ఫైల్)

భానుపురి (సూర్యాపేట) : జిల్లాలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాల ద్వారా ఈ వానాకాలం సీజన్‌లో రైతుల నుంచి సేకరించిన సన్నధాన్యాన్ని మిల్లులకు కేటాయించొద్దని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. ఈ ధాన్యాన్ని రాష్ట్ర పౌర సరఫరాల శాఖ ఆధ్వర్యంలో ప్రభుత్వ గోదాములకు తరలించనుంది. ఈ మేరకు జిల్లాలో ఉన్న గోదాములెన్ని.. వాటిలో ప్రస్తుతం ఎంత మేర ప్రభుత్వ, ప్రైవేటు మిల్లుల ధాన్యం నిల్వ ఉంది.. ఈ సీజన్‌లో రైతుల నుంచి సేకరించే ధాన్యం ఖాళీగా ఉన్న గోదాముల్లో సరిపోతుందా.. లేదా అనే సమాచారాన్ని జిల్లా యంత్రాంగం సేకరిస్తోంది. ఈ మేరకు అధికారులు గోదాములను తనిఖీ చేసి నివేదికను కలెక్టర్ ద్వారా రాష్ట్ర ప్రభుత్వానికి పంపనున్నట్లు సమాచారం.

3.79 లక్షల ఎకరాల్లో సన్నాలు సాగు

జిల్లావ్యాప్తంగా ఈ వానాకాలం సీజన్‌లో 4.72 లక్షల ఎకరాల్లో రైతులు వరి సాగు చేశారు. ఇందులో 3.79 లక్షల ఎకరాల్లో సన్నాలు, 93 వేల ఎకరాల్లో దొడ్డు రకం ధాన్యం సాగయింది. దాదాపు 10.22 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం దిగుబడి రానుందని అంచనా. దొడ్డురకం, రైతుల అవసరాలు, ప్రైవేటు మిల్లర్లకు అమ్మకం పోగా.. ప్రభుత్వ కొనుగోలు కేంద్రాలకు దాదాపు 1,71,197 మెట్రిక్ టన్నుల సన్న రకం ధాన్యం వస్తుందని అధికారులు భావిస్తున్నారు. ఈ ధాన్యాన్ని మిల్లర్లకు సీఎంఆర్‌కు ఇవ్వకుండా నేరుగా గోదాములకు తరలించనున్నారు. సన్నధాన్యం నూక ఎక్కువగా ఉంటుందని, తేమశాతాన్ని 17 నుంచి 14 శాతానికి తగ్గించాలని మిల్లర్లు ప్రధానంగా డిమాండ్ చేస్తున్నారు. కస్టోడియన్ మిల్లింగ్, రవాణా చార్జీలు పెంచాలని, క్వింటాకు రూ.300 పరిహారం ఇవ్వాలని కోరుతున్నారు. ఈ క్రమంలో మిల్లర్లకు సన్నధాన్యం ఇవ్వొద్దని ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది.

ప్రాంతం	కెపాసిటీ (మె.టన్నుల్లో)	ఖాళీ స్థలం
బాలాజీనగర్	26,500	21,500
సీతారాంపురం	30,000	10,000
హుజూర్‌నగర్	19,836	17,836
శాంతినగర్	25,000	25,000
సింగారం	15,000	15,000
సూర్యాపేట	50,000	30,000
నూతనకల్	2,500	2,500
నంద్యాలవారిగూడెం	5,000	2,500
మఠంపల్లి	2,500	2,500
గరిడేపల్లి	2,500	2,500
తుంగతుర్తి	5,000	2,500
మొత్తం	1,83,836	1,31,836

గోదాముల పరిస్థితిపై ఆరా..

ఈ క్రమంలో అధికారులు జిల్లాలో ఉన్న గోదాముల పరిస్థితిపై ఆరా తీస్తున్నారు. జిల్లాలో మొత్తం 1,83,836 లక్షల మెట్రిక్ టన్నుల సామర్థ్యం గల సెంట్రల్ వేర్ హౌజింగ్ కార్పొరేషన్-1, స్టేట్ వేర్ హౌజింగ్ కార్పొరేషన్-2, అగ్రికల్చర్ మార్కెట్ కమ్యూనిటీ గోదాములు-5, స్టేట్ వేర్ హౌజింగ్ కార్పొరేషన్ పరిధిలో నడిచే ప్రైవేటు గోదాములు-3 మొత్తంగా 11 గోదాములు ఉన్నాయి. వీటిలో ప్రస్తుతం 52 వేల మెట్రిక్ టన్నుల ధాన్యం నిల్వ ఉండగా.. 1,31,836 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం నిల్వ చేసుకునే అవకాశమున్నట్లు అధికారులు గుర్తించారు. కాగా అధికారుల అంచనా మేరకు 1.71 మెట్రిక్ టన్నుల సన్నధాన్యం కొనుగోలు కేంద్రాలకు వస్తే గోదాముల్లో నిల్వ చేసుకునేందుకు ఎలాంటి సమస్య ఉత్పన్నం కాదు. ఒకవేళ అంచనా కంటే కొనుగోలు కేంద్రాల్లో రైతులు సన్నరకం ధాన్యం విక్రయిస్తే కొంత సమస్య తలెత్తే అవకాశముంటుందని అధికారులు భావిస్తున్నారు.

పోలీసు కుటుంబాల సంక్షేమానికి కృషి



చెక్కు అందజేస్తున్న ఎస్పీ సన్‌ప్రీత్‌సింగ్

సూర్యాపేటటౌన్ : పోలీస్ సిబ్బంది కుటుంబాల సంక్షేమానికి పోలీస్‌శాఖ కృషి చేస్తోందని ఎస్పీ సన్‌ప్రీత్‌సింగ్ అన్నారు. ఆర్మ్‌డ్ రిజర్వ్‌లో పని చేస్తున్న కానిస్టేబుల్ సైదులు ఇటీవల అకస్మాత్తుగా మృతిచెందాడు. ఆయన కుటుంబ సభ్యులకు పోలీస్ భద్రత స్కీం ద్వారా గురువారం జిల్లా కేంద్రంలోని పోలీస్ కార్యాలయంలో ఎస్పీ సన్‌ప్రీత్‌సింగ్ రూ.8 లక్షల విలువ గల చెక్కును అందజేశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ సిబ్బంది కుటుంబాలకు భద్రత పథకం బాసటగా ఉంటుందన్నారు. అదేవిధంగా ఇటీవల మృతిచెందిన హోంగార్డులు శ్రీనివాస్, గౌస్‌పాషా, సక్రునాయక్‌ల కుటుంబ సభ్యులకు హోంగార్డు కుటుంబాల సంక్షేమంలో భాగంగా ఆర్థిక చేయూతనందించారు. ఏఆర్ అదనపు ఎస్పీ జనార్దన్‌రెడ్డి, ఏఆర్ డీఎస్పీ నరసింహాచారి, ఏఓ మంజుభార్గవి, పోలీసు సంక్షేమ సంఘం అధ్యక్షుడు రామచందర్‌గౌడ్ పాల్గొన్నారు.

ముగిసిన జిల్లాస్థాయి కళా ఉత్సవ్ పోటీలు

సూర్యాపేటటౌన్ : జిల్లా విద్యాశాఖ ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని బాలభవన్‌లో నిర్వహిస్తున్న కళా ఉత్సవ్ జిల్లా స్థాయి పోటీలు గురువారం ముగిశాయి. చివరిరోజు విద్యార్థులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. కార్యక్రమంలో డీఈఓ అశోక్, జిల్లా విద్యాశాఖ కోఆర్డినేటర్ దేరవాశెట్టి జనార్దన్, జిల్లా సైన్స్ అధికారి ఎల్.దేవరాజు, జి.నాగరాణి, శ్రీదేవి, రేణుక, శైలజ, దీపాదేవి, విజయలక్ష్మి, ఉమా, సత్యనారాయణసింగ్, వీరునాయుడు పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయికి ఎంపికైంది వీరే..

ఓకల్ మ్యూజిక్‌లో కే.రశ్మిత (పదో తరగతి కేజీబీవీ నాగారం), ఇన్‌స్ట్రుమెంట్ మ్యూజిక్‌లో పి.అక్షయ్(9వ తరగతి జెడ్పీహెచ్‌ఎస్ బాలుర కోదాడ), డ్యాన్స్ కేటగిరిలో కె.వర్ష (9వ తరగతి జయ హైస్కూల్ సూర్యాపేట), థియేటర్ కేటగిరిలో మోనో యాక్షన్‌లో జి హర్షిని(9వ తరగతి ఎమ్మెస్సార్ సెంట్రల్ స్కూల్ సూర్యాపేట), విజువల్ ఆర్ట్స్ కేటగిరిలో త్రీడీ ఆర్ట్‌లో ఎస్‌డీ సాదిక్(9వ తరగతి జెడ్పీహెచ్‌ఎస్ బాలుర కోదాడ), ట్రెడిషనల్ స్టోరీ టెల్లింగ్‌లో పి.హరీష్‌కుమార్(9వ తరగతి జెడ్పీహెచ్‌ఎస్ బాలుర కోదాడ)లు రాష్ట్ర స్థాయికి ఎంపికయ్యారు.

కలుషిత నీరు, ఆహారంతోనే వ్యాధులు

హుజూర్‌నగర్ (చింతలపాలెం) : కలుషిత నీరు, ఆహారం తీసుకోవడం వల్ల వ్యాధులు సంక్రమించే అవకాశం ఉన్నదని జిల్లా ఎపిడేమియాలజిస్ట్ డాక్టర్ సతీష్ అన్నారు. గురువారం చింతలపాలెంలోని ముత్యాలమ్మ గుడి వీధిని ఆయన సందర్శించి వ్యాధిగ్రస్తులను పరామర్శించారు. సిబ్బందిని అడిగి డయేరియా కేసుల వివరాలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా డయేరియా వ్యాప్తిని అరికట్టడం, నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను డాక్టర్ సతీష్ వివరించారు. కార్యక్రమంలో గణాంక అధికారి వీరయ్య, డాక్టర్ సచిన్, హెల్త్ ఎడ్యుకేటర్ శ్రీదేవి, సూపర్‌వైజర్ రాజకుమార్, హెల్త్ అసిస్టెంట్ రాములు, వైద్య సిబ్బంది, ఆశా కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

క్రీడలతోనే అంతర్జాతీయ గుర్తింపు



జెండా ఊపి సీఎం కప్ టార్చ్ ర్యాలీని ప్రారంభిస్తున్న కలెక్టర్ తేజస్ నంద్‌లాల్ పవార్, ఎస్పీ సన్‌ప్రీత్‌సింగ్

- సీఎం కప్-2024 టార్చ్‌ను వెలిగించి ర్యాలీ ప్రారంభించిన కలెక్టర్

సూర్యాపేటటౌన్ : క్రీడలతోనే అంతర్జాతీయ గుర్తింపు వస్తుందని కలెక్టర్ తేజస్ నంద్‌లాల్ పవార్ అన్నారు. గురువారం సీఎం కప్-2024 టార్చ్‌ని కలెక్టర్ వెలిగించి జిల్లా కేంద్రంలోని ఎస్వీ ఇంజనీరింగ్ కళాశాల వద్ద ఎస్పీ సన్‌ప్రీత్‌సింగ్‌తో కలిసి ర్యాలీని ప్రారంభించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ విద్యార్థులు చదువుతోపాటు క్రీడలపై శ్రద్ధ వహించి గుర్తింపు తెచ్చుకోవాలన్నారు. ఒలింపిక్ పోటీల్లో రాష్ట్ర క్రీడాకారులు పతకం తెచ్చేందుకు రాష్ట్ర ప్రభుత్వం క్రీడలకు అధిక ప్రాధాన్యత ఇస్తోందని తెలిపారు. పల్లెల నుంచి ప్రపంచ స్థాయి విజేత నినాదంతో క్రీడాకారులతో సీఎం కప్-2024 టార్చ్ ర్యాలీని నిర్వహిస్తున్నారన్నారు. ఎస్వీ ఇంజనీరింగ్ కాలేజీ నుంచి సంతోష్ బాబు చౌరస్తా మీదుగా కొత్త బస్టాండ్ వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రెజ్లింగ్ కోచ్ నందకిశోర్, నోడల్ అధికారి మధు, స్కూల్ స్పోర్ట్స్ అధికారి ఆర్‌కె బోస్, చీఫ్ అథ్లెటిక్ కోచ్ ఎండీ గౌస్, డీవైఎస్ఓ రామచంద్రరావు, ఏఆర్ అదనపు ఎస్పీ జనార్దన్‌రెడ్డి, క్రీడాకారులు, పీఈటీలు, ఉపాధ్యాయులు, యువజన సంఘం నాయకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

వాల్మీకి జీవితం స్ఫూర్తిదాయకం

- కలెక్టర్ తేజస్ నంద్‌లాల్ పవార్

భానుపురి (సూర్యాపేట) : మహర్షి వాల్మీకి జీవిత చరిత్ర తెలుసుకుని నేటితరం స్ఫూర్తి పొందాలని కలెక్టర్ తేజస్ నంద్‌లాల్ పవార్ అన్నారు. గురువారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో మహర్షి వాల్మీకి జయంతిని జిల్లా వెనుకబడిన తరగతుల అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ బీఎస్ లతతో కలిసి మహర్షి వాల్మీకి చిత్రపటానికి కలెక్టర్ పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ రామాయణంలో మనిషి నడవడిక, మంచి చెడుల గురించి తెలియజేసిన వాల్మీకి అందరికీ స్ఫూర్తిదాయకమన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా వెనుకబడిన తరగతుల అభివృద్ధి శాఖ అధికారి అనసూయ, ఎస్సీ అభివృద్ధి అధికారి లత, డీఆర్‌డీఓ అప్పారావు, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ ఎల్.శ్రీనివాస్, బీసీ సంఘం జిల్లా అధ్యక్షుడు చలమల్ల నరసింహ, దాసరి వెంకన్న యాదవ్, కీర్తి వెంకటేశ్వర్లు, బైరు వెంకటకృష్ణ, జక్కుల రామచంద్ర యాదవ్, తన్నీరు వాసుదేవ్, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



వాల్మీకి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న కలెక్టర్ తేజస్ నంద్‌లాల్ పవార్

జిల్లా పోలీస్ కార్యాలయంలో వాల్మీకి మహర్షి జయంతి

సూర్యాపేటటౌన్ : వాల్మీకి మహర్షి జయంతిని గురువారం జిల్లా పోలీసు కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వాల్మీకి మహర్షి చిత్రపటానికి ఎస్పీ సన్ ప్రీత్‌సింగ్, పోలీస్ అధికారులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ఏఆర్ ఏఎస్పీ జనార్దన్ రెడ్డి, ఏఆర్ డీఎస్పీ నరసింహ, పోలీస్ అధికారులు పాల్గొన్నారు.

గంధం ఊరేగింపు



నల్లగొండలోని లతీఫ్ ఉల్లా షాఖాద్రి ఉర్సులో భాగంగా నిర్వహించిన గంధం ఊరేగింపులో పాల్గొన్న మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, కలెక్టర్ నారాయణరెడ్డి, ఎస్పీ శరత్‌చంద్ర పవార్ - రామగిరి(నల్లగొండ)

కొలువుల నిలయం

నిరుద్యోగులకు బాసటగా సూర్యాపేట గ్రంథాలయం

- ఇక్కడ ప్రిపేర్ అయిన వారికి భారీ సంఖ్యలో ఉద్యోగాలు
- ఇటీవల డీఎస్సీలో 20 మంది ఉపాధ్యాయులుగా ఎంపిక
- సహాయ సహకారాలు అందిస్తున్న సిబ్బంది



సూర్యాపేట జిల్లా కేంద్రంలోని గ్రంథాలయంలో పోటీ పరీక్షలకు సన్నద్ధమవుతున్న అభ్యర్థులు

భానుపురి (సూర్యాపేట) : వేల రూపాయలు ఖర్చు చేసి ఉద్యోగాల కోసం శిక్షణ పొందలేక జిల్లాలోని పలువురు ఆ గ్రంథాలయాన్నే నమ్ముకున్నారు. అందులో అందుబాటులో ఉన్న పుస్తకాలను చదివి విజయం సాధించారు. ఆ గ్రంథాలయంలో పోటీ పరీక్షలకు సన్నద్ధమైన నిరుద్యోగులు పోలీస్, విద్యుత్, పంచాయతీ రాజ్, టీచర్ ఉద్యోగాలు సాధించారు. నేడు పేద విద్యార్థులకు సూర్యాపేట గ్రంథాలయం కొలువుల నిలయంగా మారింది. ఇటీవల కాలంలో ఈ గ్రంథాలయంలో చదివి ఉద్యోగాలు సాధిస్తున్నవారి సంఖ్య క్రమంగా పెరుగుతోంది. పోటీ పరీక్షలకు ప్రిపేర్ అవుతున్న యువతకు ఇక్కడి సిబ్బంది సహాయ సహకారాలు అందించి దన్నుగా నిలుస్తున్నారు. ఇటీవల డీఎస్సీలో ప్రతిభ కనబరిచి ఉపాధ్యాయ వృత్తిని చేపట్టిన వారిలో సుమారు 20 మంది దాకా సూర్యాపేట గ్రంథాలయంలోనే సన్నద్ధమయ్యారు.

20 మంది అభ్యర్థుల ఎంపిక

ప్రభుత్వం డీఎస్సీని జూలై 18వ తేదీ నుంచి ఆగస్టు 5వ తేదీ వరకు నిర్వహించింది. బుధవారం నుంచే కొత్తగా ఎంపికైన ఉపాధ్యాయులు విధుల్లో చేరారు. ఈ ఉపాధ్యాయ పోస్టుల కోసం జిల్లావ్యాప్తంగా వేలాది మంది నిరుద్యోగులు కుస్తీ పట్టారు. హైదరాబాద్ వంటి నగరాల్లో ఉంటూ ప్రైవేట్ ఇనిస్టిట్యూట్‌లలో చదువుకున్నారు. జిల్లా కేంద్రంలోని జిల్లా కేంద్రశాఖ గ్రంథాలయంలోనూ చాలామంది నిరుద్యోగులు పరీక్షలకు సన్నద్ధమయ్యారు. ఇప్పటి వరకు ఈ గ్రంథాలయంలో ప్రిపేర్ అయిన దాదాపు 20 మందికి ఉద్యోగాలు వచ్చాయి.

వివిధ కేటగిరీల్లో ఉద్యోగాలు

జిల్లా కేంద్రంలోని గ్రంథాలయంలో ఐదారేళ్లుగా పోటీ పరీక్షలకు ప్రిపేర్ అయిన చాలామంది నిరుద్యోగులు ఉద్యోగాలు పొందారు. 30 మంది దాకా పోలీస్ కానిస్టేబుళ్లు, పీఆర్ ఏఈఈగా ఒకరు, విద్యుత్‌శాఖలో ఒకరు, గురుకులాల్లో 12 మంది, అగ్రికల్చర్ ఏఈగా ఒకరు, పంచాయతీరాజ్ ఏఈగా ఒకరు ఉద్యోగాలు దక్కించుకున్నారు. ఇక్కడ వంద రూపాయల సభ్యత్వ రుసుము తప్ప పోటీ పరీక్షలకు ప్రిపేర్ అయ్యే యువతకు ఏ పుస్తకం కావాలన్నా ఉచితంగానే అందిస్తున్నారు. గ్రంథాలయ సిబ్బంది సహాయ సహకారాలతో నిరుద్యోగులు భారీ సంఖ్యలో ఉద్యోగాలు సాధిస్తున్నారు.

అన్ని పుస్తకాలు అందిస్తున్నాం



సూర్యాపేట గ్రంథాలయంలో పోటీ పరీక్షల సిద్ధమయ్యే అభ్యర్థులకు కావాల్సిన అన్ని ఏర్పాట్లు చేశాం. ఇంటర్‌నెట్ సౌకర్యంతో పాటు పోటీ పరీక్షలకు కావాల్సిన పుస్తకాలన్నింటిని వారి అభిరుచి మేరకు అందిస్తున్నాం. యువత ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని ఉద్యోగాలు సాధిస్తున్నారు. చాలా సంతోషంగా ఉంది.

-బి.బాలమ్మ, జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి



పోటీ పరీక్షలకు సన్నద్ధమవుతున్న అభ్యర్థులు

సిబ్బంది సహకారం మరువలేనిది



సూర్యాపేట పట్టణంలోని గ్రంథాలయ వాతావరణం బాగుండేది. ప్రిపేర్ అయ్యేందుకు ఎలాంటి ఇబ్బంది ఉండేది కాదు. గ్రంథాలయ వాతావరణమే జాబ్ సాధించేందుకు ఉపయోగపడింది. సిబ్బంది సహాయ సహకారాలు మరవలేనివి. ప్రస్తుతం తిప్పర్తి జెడ్పీహెచ్‌ఎస్‌లో స్కూల్ అసిస్టెంట్ మ్యాథ్స్ టీచర్‌గా పనిచేస్తున్నా.

-పరికపల్లి లింగస్వామి, ఆత్మకూర్ (ఎస్) మండలం, ఏపూరు

ఏ పుస్తకం కావాలన్నా దొరుకుతుంది



సూర్యాపేట గ్రంథాలయంలో ఏ పుస్తకం కావాలన్నా దొరుకుతుంది. ఇక్కడ ప్రిపేర్ అయ్యి కేజీబీవీ సోషల్, గురుకులాల్లో టీజీటీ తెలుగు, టీజీటీ సోషల్ ఉద్యోగాలు సాధించా. ఇటీవల డీఎస్సీలోనూ ఎస్‌జీటీ, ఎస్ఏ సోషల్, తెలుగు సాధించా. ప్రస్తుతం దురాజ్‌పల్లి జెడ్పీహెచ్‌ఎస్‌లో స్కూల్ అసిస్టెంట్ సోషల్ టీచర్‌గా ఎంపికయ్యా.

-ఎస్.శృతి, పెన్‌పహాడ్ మండలం ఎర్రంశెట్టిగూడెం

ఒంటిపై పెట్రోల్ పోసుకొని వ్యక్తి ఆత్మహత్య


దస్తగిరి (ఫైల్)

గరిడేపల్లి: ఒంటిపై పెట్రోల్ పోసుకొని వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న ఘటన గరిడేపల్లి మండలం గానుగబండ గ్రామంలో గురువారం తెల్లవారుజామున జరిగింది. మృతుడి కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. గానుగబండ గ్రామానికి చెందిన షేక్ దస్తగిరి(48) ఇటీవల కొత్తగా ఇంటిని నిర్మించి అప్పులపాలయ్యాడు. అప్పులు తీర్చే మార్గం లేక గురువారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఒంటిపై పెట్రోల్ పోసుకొని నిప్పంటించుకున్నాడు. మృతుడికి భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు. ఈ ఘటనపై తమకు ఎలాంటి ఫిర్యాదు అందలేదని గరిడేపల్లి ఎస్ఐ నరేష్ తెలిపారు.

టీడీఎస్ జేఏసీ ఉమ్మడి జిల్లా అధ్యక్షుడిగా ఉపేందర్



నాగారం: తెలంగాణ దళిత సంఘాల (టీడీఎస్) జేఏసీ ఉమ్మడి నల్లగొండ జిల్లా అధ్యక్షుడిగా నాగారం మండల కేంద్రానికి చెందిన చిప్పలపల్లి ఉపేందర్ నియమితులయ్యారు. ఈ మేరకు సంఘం రాష్ట్ర చైర్మన్ ఈదుల పరశురాం చేతులమీదుగా గురువారం ఆయన నియామక పత్రం అందుకున్నారు. ఈ సందర్భంగా ఉపేందర్ మాట్లాడుతూ.. దళితుల సమస్యల పరిష్కారానికి కృషిచేస్తానని అన్నారు.

విత్తనోత్పత్తి క్షేత్రం ఏర్పాటుకు సన్నాహాలు

- డిండి మండలంలోని చెరుకుపల్లిలో ఏర్పాటు
- యాసంగి నుంచే విత్తనోత్పత్తి ప్రారంభం
- తొలుత వరి, వేరుశనగ విత్తనాల ఉత్పత్తి
- నేషనల్ సీడ్ కార్పొరేషన్‌తో వ్యవసాయశాఖ ఒప్పందం


చెరుకుపల్లిలో వ్యవసాయశాఖ భూములు పరిశీలిస్తున్న డీఏఓ శ్రవణ్‌కుమార్

నల్లగొండ అగ్రికల్చర్: జిల్లాలో విత్తనోత్పత్తి క్షేత్రాన్ని ప్రారంభించేందుకు వ్యవసాయశాఖ కసరత్తు ప్రారంభించింది. ప్రస్తుతం జిల్లాలో కేవీకే కంపాసాగర్ విత్తనోత్పత్తి క్షేత్రంలో ఫౌండేషన్ సీడ్‌ను మాత్రమే ఉత్పత్తి చేస్తున్నారు. దీనికి తోడు రాష్ట్ర విత్తనాభివృద్ధి సంస్థ నందిపాడు కూడా కొంత వరి విత్తనాలను ఉత్పత్తి చేసి రైతులకు సరఫరా చేస్తున్నప్పటికీ సరిపోని పరిస్థితి నెలకొంటుంది. జిల్లాలో వరిసాగు విస్తీర్ణం పెరగడంతో రైతులు నాణ్యమైన విత్తనాల కోసం ప్రైవేట్ సంస్థలను ఆశ్రయించాల్సి వస్తోంది. దీనిని దృష్టిలో ఉంచుకుని తక్కువ సమయంలో ఎక్కువ దిగుబడినిచ్చే విత్తనాలను విక్రయించాలని జిల్లా వ్యవసాయశాఖ నిర్ణయించింది. ఇందులో భాగంగా డిండి మండలం చెరుకుపల్లి గ్రామంలోని వ్యవసాయ శాఖకు చెందిన 200 ఎకరాల్లో విత్తనోత్పత్తిని తిరిగి పునరుద్ధరించనున్నారు. దానికి అవసరమైన సాగునీరు, బోరు బావులు కూడా సిద్ధం చేసుకున్నారు. ఇప్పటికే విత్తనోత్పత్తి క్షేత్రానికి సంబంధించిన భూములను జిల్లా వ్యవసాయశాఖ అధికారులు పరిశీలించి దానికి అవసరమైన అన్న వసతులు కల్పించే విధంగా అన్ని చర్యలను చేపట్టారు. ఈ క్షేత్రానికి పూర్తి స్థాయిలో ఏడీఏతో పాటు ఇద్దరు వ్యవసాయాధికారులను, ఇతర పరిపాలనా విభాగానికి చెందిన సిబ్బందిని కూడా నియమించారు.

నేషనల్ సీడ్ కార్పొరేషన్‌తో ఒప్పందం

ఈ యాసంగి సీజన్ నుంచి తొలుత వరి, వేరుశనగ విత్తనాలను ఉత్పత్తి చేయాలని నిర్ణయించింది. దీనికి అవసరమైన ఒప్పందాన్ని నేషనల్ సీడ్ కార్పొరేషన్‌తో వ్యవసాయశాఖ ఒప్పందం చేసుకుంది. డిండి విత్తనోత్పత్తి కేత్రంలో ఉత్పత్తి చేసిన వరి, వేరుశనగ విత్తనాలను నేషనల్ సీడ్ కార్పొరేషన్‌ను అందజేసి అక్కడి నుంచి నాణ్యమైన విత్తనాలను రైతులకు అందించే విదంగా వ్యవసాయశాఖ ఒప్పందం చేసుకుంది.

మహిళా హక్కుల సాధనకు పోరాటం చేస్తాం


మాట్లాడుతున్న మల్లు లక్ష్మి

నల్లగొండ టౌన్: మహిళా హక్కుల సాధనకు అలుపెరుగని పోరాటాలు నిర్వహిస్తామని ఐద్వా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మల్లు లక్ష్మి అన్నారు. గురువారం నల్లగొండలోని యూటీఎఫ్ భవన్‌లో నిర్వహించిన ఐద్వా మహాసభలో ఆమె జెండా ఆవిష్కరించి మాట్లాడారు. మనువాద ప్రభుత్వం వచ్చినప్పటికీ మహిళలపై అనేక దౌర్జన్యాలు జరుగుతున్నాయన్నారు. మహిళల రక్షణకు ప్రభుత్వాలు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. నిత్యావసరాల ధరలు అదుపు చేయడంలో ప్రభుత్వాలు ఘోరంగా విఫలమయ్యాయని ఆరోపించారు. ఉపాధి పనులు కల్పించడంలో ప్రమాణాలను పాటించడం లేదన్నారు. పేదలకు రేషన్ కార్డులు, పింఛన్లు అమలు చేయాలని, ప్రభుత్వ ఆస్పత్రులను బలోపేతం చేసి ప్రజలకు పూర్తి స్థాయిలో వైద్యం అందించాలన్నారు. ఈ నెల 21 నుంచి 29వ తేదీల్లో ఖమ్మంలో జరిగే ఐద్వా రాష్ట్ర మహాసభలకు జిల్లా నుంచి పెద్ద ఎత్తున తరలిరావాలని పిలుపునిచ్చారు. అనంతరం చాకలి ఐలమ్మ, మల్లు స్వరాజ్యం చిత్రపటాలకు నివాళులర్పించారు. అదేవిధంగా ఐద్వా జిల్లా నూతన కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షురాలిగా పోలేబోయిన వరలక్ష్మి, ప్రధాన కార్యదర్శిగా పాలడుగు ప్రభావతి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. కార్యవర్గ సభ్యులుగా జిట్ట సరోజ, కొండ అనురాధ, నాగమణి, తుమ్మల పద్మ, భూతంఅరుణ కుమారి, నిమ్మల పద్మ, కారంపుడి ధనలక్ష్మి, పాదూరి గోవర్ధన, మేకల వర్ణ, లక్ష్మి, ఎం.డి. సుల్తానాతోపాటు 33 మంది కమిటీని ఎన్నుకున్నారు.

లతీఫ్ ఉల్లా షాఖాద్రి ఉర్సు ప్రారంభం

- గంధం ఊరేగింపును ప్రారంభించిన మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి
- గుట్టపైకి రూ.30 కోట్లతో ఘాట్ రోడ్డు పనులు చేపడతామని హామీ


గంధం తీసుకెళ్తున్న కలెక్టర్ నారాయణరెడ్డి, ఎస్పీ శరత్‌చంద్ర పవార్


గంధం తీసుకెళ్తున్న పోలీసులు


నృత్యం చేస్తున్న ముస్లింలు

రామగిరి(నల్లగొండ): నల్లగొండలోని లతీఫ్ ఉల్లాషాఖాద్రి ఉర్సు గురువారం ప్రారంభమైంది. పట్టణంలోని మదీనా మసీదు నుంచి గంధం ఊరేగింపును కలెక్టర్ నారాయణరెడ్డి, ఎస్పీ శరత్‌చంద్ర పవార్‌లతో కలిసి రోడ్లు, భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి ప్రారంభించారు. అనంతరం కోమటిరెడ్డి మాట్లాడుతూ.. ఉర్సును విజయవంతం చేయాలని కోరారు. లతీఫ్ ఉల్లాషాఖాద్రి గుట్ట, బ్రహ్మం గారి గుట్టను దర్శించుకునేందుకు సుమారు రూ.30 కోట్లతో ఘాట్ రోడ్డు నిర్మాణ పనులు చేపడతామన్నారు. గతంలోనే తాను దర్గా అభివృద్ధి పనులు చేశానని, బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో దర్గా అభివృద్ధిని పట్టించుకోలేదన్నారు. వక్ఫ్ ఆస్తుల పరిరక్షణకు చర్యలు తీసుకోవాలని కలెక్టర్‌ను కోరారు. కార్యక్రమంలో డీసీసీ ప్రెసిడెంట్ రాములునాయక్, ఆర్డీఓ శ్రీదేవి, మున్సిపల్ చైర్మన్ బుర్రి శ్రీనివాస్‌రెడ్డి, కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు గుమ్మల మోహన్‌రెడ్డి, మున్సిపల్ కమిషనర్ అహ్మద్ పాల్గొన్నారు.

క్రైస్తవుల అభివృద్ధికి సహకరిస్తా

క్రైస్తవుల అభివృద్ధికి సహకరిస్తానని మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి అన్నారు. నల్లగొండ పట్టణంలో గురువారం రెవరెండ్ బిషప్ కరణం ధమన్ కుమార్ 35వ గురు పట్టాభిషేక వార్షికోత్సవానికి మంత్రి హాజరై ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ బుర్రి శ్రీనివాస్‌రెడ్డి, కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు గుమ్మల మోహన్‌రెడ్డి, కౌన్సిలర్లు మాతంగి సత్యనారాయణ, బాబా, క్రైస్తవ నాయకులు పసల శౌరయ్య, కొంక సామ్‌సన్, రెవరెండ్ ఫాదర్‌లు అల్లారెడ్డి, తుమ్మ జోసెఫ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.


నల్లగొండ: బొట్టుగూడ ఉన్నత పాఠశాల నిర్మాణ పనులు పరిశీలిస్తున్న మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి

బొట్టుగూడ స్కూల్‌ను ఆదర్శంగా నిర్మిస్తాం

నల్లగొండ: రాష్ట్రంలో ఎక్కడాలేని విధంగా బొట్టుగూడ ప్రభుత్వ ఉన్నత పాఠశాల నిర్మాణం చేపడతామని రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి అన్నారు. గురువారం ఆయన నల్లగొండ పట్టణంలోని ప్రకాశం బజార్‌లో చేపట్టిన బొట్టుగూడ ప్రభుత్వ ఉన్నత పాఠశాల నిర్మాణ పనులను పరిశీలించి మాట్లాడారు. ప్రతీక్ ఫౌండేషన్ ద్వారా రూ.3కోట్లతో రాష్ట్రంలో ఏ ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాల లేని విధంగా బొట్టుగూడ ప్రభుత్వ ఉన్నత పాఠశాలను తీర్చిదిద్దనున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా కాంట్రాక్టర్‌కు, పాఠశాల హెడ్మాస్టర్‌కు మంత్రి పలు సూచనలు చేశారు. 9, 10 తరగతులకు ప్రత్యేక డిజిటల్ తరగతులు, శిక్షణ కార్యక్రమాలు నిర్వహించేలా పాఠశాల నిర్మాణం చేపట్టాలన్నారు. పాఠశాలలోని అన్ని గదుల్లో ఏసీ, లిఫ్ట్ తదితర సౌకర్యాలు కల్పిస్తామని, పనుల్లో ఎలాంటి నాణ్యత లోపించకుండా నిర్మా ణం చేపట్టాలని ఆదేశించారు. భవిష్యత్తులో అవసరమైతే మరో అంతస్తు నిర్మించేందుకు అవకాశం ఉండేలా భవన నిర్మాణం ఉండాలని అన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ బుర్రి శ్రీనివాస్ రెడ్డి , మాజీ జెడ్పీటీసీ లక్ష్మయ్య, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు గుమ్మల మోహన్‌రెడ్డి పాల్గొన్నారు.

కానిస్టేబుల్ సస్పెన్షన్, సీఐకి చార్జి మెమో

గుర్రంపోడు: మండలంలోని ముల్కలపల్లికి చెందిన జాల రజిత హత్య కేసుకు సంబంధించి గుర్రంపోడు పోలీస్ స్టేషన్ కానిస్టేబుల్ సత్యనారాయణను సస్పెండ్‌చేస్తూ గురువారం నల్లగొండ ఎస్పీ శరత్‌చంద్ర పవార్ ఆదేశాలు జారీ చేశారు. అంతేకాకుండా కొండమల్లేపల్లి సీఐ ధనుంజయకు ఎస్పీ నివేదిక ప్రకారం ఐజీపీ సత్యనారాయణ చార్జ్ మెమో జారీ చేశారు. హత్యను ఆత్మహత్యగా మార్చే ప్రయత్నం చేయడం, నిందితులను కేసు నుంచి తప్పించారని గుర్రంపోడు ఎస్ఐ వేమిరెడ్డి నారాయణరెడ్డిని ఈ నెల 14న సస్పెండ్ చేసిన విషయం తెలిసిందే. నిందితులతో కుమ్మక్కై, ఎఫ్ఐఆర్‌లో వారి పేర్లు పేర్కొనకుండా కానిస్టేబుల్ సత్యనారాయణ ద్వారా ఎస్ఐ రూ.లక్ష లంచం తీసుకున్నారని విచారణలో తేలింది.

ముగిసిన తహసీల్దార్, కంప్యూటర్ ఆపరేటర్ కస్టడీ

హుజూర్‌నగర్: ప్రభుత్వ భూములను అక్రమంగా బదిలీ చేసి రైతుబంధు నిధులు స్వాహా చేశారనే ఆరోపణలతో గతంలో హుజూర్‌నగర్ తహసీల్దార్‌గా పనిచేసిన జయశ్రీ, కంప్యూటర్ ఆపరేటర్ జగదీష్‌ల పోలీస్ కస్టడీ గురువారం ముగిసింది. మూడో రోజు హుజూర్‌నగర్ సీఐ చరమందరాజు దాదాపు ఐదు గంటల పాటు తహసీల్దార్, కంప్యూటర్ ఆపరేటర్‌ను విచారించారు. విలువైన ప్రభుత్వ, అసైన్డ్ భూములను ఎవరి ప్రోద్బలంతో ఇతరుల పేరుపై పట్టా చేశారని పోలీసులు వారిని ప్రశ్నించినట్లు సమాచారం. ఈ వ్యవహారంలో ఎవరైనా అధికారులు, ప్రజాప్రతినిధుల ప్రమేయం ఉందా అనే కోణంలో మంరిత సమాచారం రాబట్టినట్లు తెలిసింది. అంతేకాకుండా జర్నలిస్టుల ఇళ్ల పట్టాలకు సంబంధించిన వివరాలపై కూడా ఆరా తీసినట్లు తెలిసింది. తహసీల్దార్‌కు సంబంధించిన ఆస్తుల వివరాలను పరిశీలించినట్లు సమాచారం. మూడు రోజుల పోలీస్ కస్టడీ ముగియడంతో ఇద్దరినీ హుజూర్‌నగర్ కోర్టులో ప్రవేశపెట్టి జ్యుడీషియల్ రిమాండ్‌కు తరలించినట్లు సీఐ పేర్కొన్నారు.

రైలు కింద పడి యువకుడి ఆత్మహత్య

మిర్యాలగూడ అర్బన్: రైలు కింద పడి యువకుడు ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ సంఘటన మిర్యాలగూడ రైల్వే స్టేషన్ సమీపంలో గురువారం జరిగింది. రైల్వే పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. త్రిపురారం మండలం అల్వాలపాడు గ్రామానికి చెందిన చిర్ర మల్లయ్య రెండో కుమారుడు చిర్ర శ్రవణ్‌కుమార్(18) హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ కళాశాలలో ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరం చదువుతున్నాడు. దసరా పండుగకు ఇంటికి వచ్చిన అతడు గురువారం మిర్యాలగూడ రైల్వే స్టేషన్ సమీపంలో రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్నాడు. రైలు పట్టాలపై మృతదేహాన్ని గుర్తించిన స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. విషయం తెలుసుకున్న రైల్వే పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతుడి వద్ద దొరికిన ఆధారాల ప్రకారం కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చారు. పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించారు. కుటుంబ సమస్యలు, ఆర్థిక ఇబ్బందులతోనే శ్రవణ్‌కుమార్ ఆత్మహత్యకు పాల్పడి ఉంటాడని రైల్వే పోలీసులు భావిస్తున్నారు. రైలు కింద పడటానికి ముందు పురుగుల మందు తాగినట్లు పోలీసులు గుర్తించారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

హైదరాబాద్ ఎగ్జిబిషన్‌లో మర్రిచెట్టుతండా మహిళల స్టాల్


ఎగ్జిబిషన్‌లో మర్రిచెట్టుతండా మహిళలు ఏర్పాటు చేసిన స్టాల్

దేవరకొండ: హైదరాబాద్‌లోని అమీర్‌పేటలో గ్రామీణ్ సెలబ్రేటింగ్ డెవలప్‌మెంట్ కార్యక్రమంలో భాగంగా ఏర్పాటు చేసిన ఎగ్జిబిషన్‌లో దేవరకొండ మండలం మర్రిచెట్టుతండాకు చెందిన మహిళలు స్టాల్‌ను ఏర్పాటు చేశారు. నాబార్డ్ సహకారంతో ఏర్పాటు చేసిన ఈ స్టాల్‌లో గిరిజన మహిళలు తయారుచేసిన హ్యాండీ క్రాఫ్ట్ వస్తువులను ప్రదర్శించినట్లు తండా మాజీ సర్పంచ్ నేనావత్ శ్రీనునాయక్ తెలిపారు. ఈ నెల 22 వరకు ఎగ్జిబిషన్‌లో ఈ స్టాల్ కొనసాగనున్నట్లు ఆయన పేర్కొన్నారు. స్టాల్ ఏర్పాటుకు సహకరించిన నాబార్డ్, ఏఆర్‌డీఎస్ ప్రతినిధులకు కృతజ్ఞతలు తెలిపారు.

నిందితుడిని శిక్షించాలంటూ ఆందోళన


శ్రీను ఇంట్లో కొండయ్య మృతదేహాన్ని ఉంచిన కుటుంబ సభ్యులు

వేములపల్లి (మాడ్గులపల్లి): మాడ్గులపల్లి మండలంలోని నారాయణపురం గ్రామానికి చెందిన కాకునూరి కొండయ్య(64) హత్య కారణమైన వారిని శిక్షించాలంటూ గురువారం మృతుడి కుటుంబ సభ్యులు, బంధువులు ఆందోళన చేపట్టారు. కొండయ్య బుధవారం ఇంట్లో ఇంటరిగా ఉన్న సమయంలో గుర్తుతెలియని వ్యక్తులు వచ్చి కత్తులతో దాడి చేసి తీవ్రంగా గాయపర్చారు. కుటుంబ సభ్యులు అతడిని నల్లగొండ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతిచెందాడు. కొండయ్యను గ్రామానికే చెందిన కాకునూరి శ్రీను హత్య చేయించాడని కొండయ్య కుటుంబ సభ్యులు ఆరోపించారు. ఈ మేరకు గురువారం శ్రీను ఇంట్లో కొండయ్య మృతదేహాన్ని సుమారు 3 గంటల పాటు ఉంచి ఆందోళన చేపట్టారు. విషయం తెలుసుకున్న సీఐ వీరబాబు, ఎస్ఐ కృష్ణయ్య గ్రామానికి చేరుకుని నిందితులను పట్టుకుని శిక్షిస్తామని హామీ ఇవ్వడంతో కొండయ్య కుటుంబ సభ్యులు, బంధువులు ఆందోళన విరమించి మృతదేహాన్ని తమ ఇంటికి తీసుకెళ్లారు. గ్రామంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు బందోబస్తు నిర్వహించారు.

రేషన్ బియ్యం తరలిస్తున్న ముఠా అరెస్ట్

- రూ.18 లక్షల విలువైన బియ్యం, 2 లారీలు స్వాధీనం
- వివరాలు వెల్లడించిన నల్లగొండ ఎస్పీ శరత్‌చంద్ర పవార్


వివరాలు వెల్లడిస్తున్న ఎస్పీ శరత్‌చంద్ర పవార్

నల్లగొండ క్రైం: రేషన్ బియ్యాన్ని ఇతర రాష్ట్రాలకు తరలిస్తున్న ముఠాను వాడపల్లి పోలీసులు పట్టుకున్నారు. ఈ కేసుకు సంబంధించిన వివరాలను నల్లగొండ ఎస్పీ శరత్‌చంద్ర పవార్ గురువారం తన కార్యాలయంలో మిర్యాలగూడ డీఎస్పీ రాజశేఖర్‌రాజుతో కలిసి విలేకరులకు వెల్లడించారు. ఎస్పీ తెలిపిన వివరాల ప్రకారం. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని బాపట్ల పట్టణానికి చెందిన శ్రీలక్ష్మీవెంకటేశ్వర అయ్యప్ప ట్రేడర్స్ యజమాని చీమకుర్తి సుధాకర్ రైతుల నుంచి వడ్లు కొనుగోలు చేయడంతో పాటు గుంటూరు, బాపట్ల, నరసరావుపేట ప్రాంతాల్లో రేషన్ బియ్యాన్ని తక్కువ ధరకు కొనుగోలు చేసి తన మిల్లులో వాటిని పాలిష్ చేసి సన్న బియ్యంగా మార్చి గుంటూరుకు చెందిన ఏజెంట్ అశోక్ ద్వారా నెలకు 10 నుంచి 12 లారీలను తెలంగాణ, తమిళనాడు, కర్ణాటక, మహారాష్ట్ర, గుజరాత్, రాజస్తాన్ రాష్ట్రాలకు అక్రమ రవాణా చేస్తున్నాడు. కర్ణాటక రాష్ట్రం బసవకళ్యాణ్ జిల్లాకు చెందిన సయ్యద్ సలావుద్దీన్ లారీలో బియ్యం లోడ్ చేసి అశోక్, సుధాకర్ తెలంగాణ మీదుగా ముంబైకి రేషన్ బియ్యం తరలిస్తుండగా.. విశ్వసనీయ సమాచారం మేరకు రాష్ట్ర సరిహద్దు అయిన వాడపల్లి శివారులో పౌరసరఫరాల అధికారులతో కలిసి పోలీసులు లారీని పట్టుకున్నారు. అదేవిధంగా మరో లారీలో బాపట్ల నుంచి గుజరాత్‌కు తరలిస్తున్న రేషన్ బియ్యాన్ని కూడా పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. లారీ డ్రైవర్ భీమయ్యను అదుపులోకి తీసుకున్నారు. రూ. 18లక్షల విలువైన 504 క్వింటాళ్ల రేషన్ బియ్యం, రెండు లారీలను సీజ్ చేసినట్లు ఎస్పీ తెలిపారు. చీమకుర్తి సుధాకర్, సయ్యద్ సలావుద్దీన్‌ను అరెస్ట్ చేశామని, అశోక్ పరారీలో ఉన్నట్లు పేర్కొన్నారు. ఈ కేసును ఛేదించిన మిర్యాలగూడ రూరల్ సీఐ వీరబాబు, వాడపల్లి ఎస్ఐ, డిప్యూటీ తహసీల్దార్ జావిద్‌ను ఎస్పీ అభినందించారు.

అనుమానాస్పద స్థితిలో బాలుడు మృతి

పెద్దఅడిశర్లపల్లి: అనుమానాస్పద స్థితిలో బాలుడు మృతిచెందిన ఘటన పెద్దఅడిశర్లపల్లి మండలంలోని మునావత్ తండాలో బుధవారం సాయంత్రం జరిగింది. గురువారం గుడిపల్లి ఎస్ఐ నర్సింహులు తెలిపిన వివరాల ప్రకారం.. మునావత్‌తండాకు చెందిన మునావత్ మోహన్ కుమారుడు దత్తు(12) హైదరాబాద్‌లో ఏడో తరగతి చదువుతున్నాడు. దసరా సెలవులకు ఇంటికి వచ్చాడు. సెలవులు ముగియడంతో బుధవారం దత్తు హైదరాబాద్‌కు బయలుదేరాల్సి ఉండగా.. తన తండ్రికి వ్యవసాయ పనులు ఉండటంతో ఆగిపోయారు. బుధవారం రాత్రి సాయంత్రం ఇంట్లో ఎవరూ లేని సమయంలో దత్తు కిటికీకి ఉరేసుకున్నాడు. అయితే బుధవారం ఉదయం వ్యవసాయబావి వద్ద దత్తు తాతతో తమ పాలివారైన మునావత్ బిల్లు ఘర్షణ పడ్డాడు. దీంతో తమకు మునావత్ బిల్లు కుటుంబ సభ్యులపై అనుమానం ఉందని దత్తు తండ్రి మోహన్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కొండమల్లేపల్లి సీఐ ధనుంజయ్య గౌడ్, ఎస్ఐ నర్సింహులుగౌడ్ ఘటనా స్థ లానికి చేరుకొని వివరాలు సేకరించారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని దేవరకొండ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అనంతరం కుటుంబ సభ్యుల కోరిక మేరకు నల్లగొండ మెడికల్ కళాశాలకు పోస్టుమార్టంకు పంపారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

డీజే యజమానికి జరిమానా

గరిడేపల్లి మండలంలోని కీతవారిగూడెంలో ఇటీవల అనుమతులు లేకుండా డీజే నిర్వహించిన వ్యక్తిని పోలీసులు గురువారం తహసీల్దార్ ముందు హాజరుపర్చారు. తహసీల్దార్ కవిత డీజే యజమానికి రూ.30వేల జరిమానా విధించారు. నెల క్రితం తహసీల్దార్ దగ్గర రూ.లక్ష పూచికత్తుపై బైండోవర్ చేసిన తర్వాత కూడా డీజే నడపడంతో డీజేని సీజ్ చేసి తహసీల్దార్ ముందు ప్రవేశపెట్టారు. అనుమతులు లేకుండా డీజే నిర్వహిస్తే చట్టపరంగా చర్యలు తీసుకుంటామని ఎస్ఐ నరేష్ హెచ్చరించారు.

ముదిమాణిక్యం కాలువలో వ్యక్తి మృతదేహం లభ్యం

త్రిపురారం: మండలంలోని నీలాయిగూడెం గ్రామ పంచాయతీ పరిధిలోని ఘంటారావు క్యాంపు వద్ద ముదిమాణిక్యం కాలువలో వ్యక్తి మృతదేహం లభ్యమైంది. గురువారం త్రిపురారం పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఖమ్మం పట్టణంలోని సాయిగణేష్ నగర్‌కు చెందిన కన్నెకంటి గోపికిషోర్(57) మానసికస్థితి సరిగ్గా ఉండటం లేదు. కుటుంబ సభ్యులు అతడికి ఖమ్మంలోని ఓ ఆస్పత్రిలో వైద్యం చేయించారు. అయినా ఆరోగ్య పరిస్థితి కుదురుకోకపోవడంతో కొద్ది రోజులు బయట తిరుగుతూ ఇంటికి వచ్చేవాడు. ఈ నెల 12వ తేదీన ఇంటి నుంచి బయటకు వెళ్లిన గోపికిషోర్ తిరిగి రాలేదు. గురువారం ఉదయం 7గంటల సమయంలో త్రిపురారం మండలంలోని నీలాయిగూడెం గ్రామ పంచాయతీ పరిధిలోని ఘంటారావు క్యాంపు వద్ద ముదిమాణిక్యం కాలువలో స్థానికులు గుర్తుతెలియని మృతదేహాన్ని గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు అక్కడికి చేరుకుని మృతదేహం వద్ద దొరికిన ఆధారాల ప్రకారం మృతుడు గోపికిషోర్‌గా గుర్తించి కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. కాలువ నుంచి మృతదేహాన్ని బయటకు తీసి పోస్టుమార్టం నిమిత్తం మిర్యాలగూడ ఏరియా ఆస్పత్రికి తరలించారు. మృతుడి కుమారుడు హరిదీప్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు హెడ్ కానిస్టేబుల్ శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు.

బాలిక ఆచూకీ లభ్యం

- ఇద్దరి రిమాండ్

భువనగిరి క్రైం: పట్టణంలోని కిరాణ దుకాణం నుంచి బాలికను తీసుకెళ్లిన వ్యక్తితో పాటు అతడికి సహకరించిన మరో వ్యక్తిని రిమాండ్‌కు తరలించినట్లు భువనగిరి పట్టణ సీఐ సురేష్‌కుమార్ తెలిపారు. గురువారం సీఐ తెలిపిన వివరాల ప్రకారం.. బిహార్ రాష్ట్రానికి చెందిన వలస కుటుంబం డాల్ఫిన్ హోటల్ సమీపంలో కిరాణం జనరల్ స్టోర్ నిర్వహిస్తూ జీవనం సాగిస్తున్నారు. వీరికి కుమార్తె ఈ నెల 10వ తేదీన కిరాణా దుకాణంలో కూర్చొని ఉండగా.. పక్కనే ఉన్న పంక్చర్ దుకాణంలో పనిచేస్తున్న ఖాజా ఖాన్ ఆమెను తీసుకుని పరారయ్యాడు. బాలిక కుటుంబ సభ్యులు ఈ నెల 14న పట్టణ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. దర్యాప్తు చేపట్టిన పోలీసులు ఖాజా ఖాన్ హైదరాబాద్‌లోని కాంచన్‌బాగ్‌లో తన సమీప బంధువైన బురాన్ పాషా ఇంట్లో ఉంటున్నట్లు తెలుసుకుని అదుపులోకి తీసుకున్నారు. ఖాజా ఖాన్, బురాన్ పాషాపై పోక్సో కేసు నమోదు చేసి రిమాండ్ చేసినట్లు సీఐ తెలిపారు. బాలికను సఖి కేంద్రానికి తరలించారు.

చికిత్స పొందుతూ విద్యార్థి మృతి


శ్రవణ్‌కుమార్ (ఫైల్)

భువనగిరి క్రైం: పురుగుల మందు తాగిన విద్యార్థి ఆస్పత్రిలో చికిత్స పొందుతూ గురువారం మృతిచెందాడు. భువనగిరి మండలం గౌస్‌నగర్ గ్రామానికి చెందిన బూషబోయిన వెంకటేశ్, అతడి కుమారుడు శ్రవణ్‌కుమార్(15) ఈ నెల 14న తమ వ్యవసాయ బావి వద్దకు వెళ్లి గేదెలకు పాలు పితుక్కొని వచ్చారు. తండ్రి వెంకటేశ్ నేరుగా ఇంటికి వెళ్లిపోగా.. శ్రవణ్‌కుమార్ పాల సెంటర్‌కు వెళ్లి పాలు పోసి ఇంటికి వచ్చాడు. ఇంటికి వచ్చిన శ్రవణ్‌కుమార్ వ్యవసాయ భూమి వద్ద పురుగుల మందు తాగినట్లు తల్లిదండ్రులకు తెలిపాడు. వెంటనే అతడిని భువనగిరి ఏరియా ఆస్పత్రికి తీసుకెళ్లారు. పరిస్థితి విషమించడంతో సికింద్రాబాద్‌లోని యశోదా ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ గురువారం మృతిచెందాడు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు భువనగిరి రూరల్ ఎస్ఐ సంతోష్ కుమార్ తెలిపారు. శ్రవణ్‌కుమార్ భువనగిరిలోని ప్రశాంతి స్కూల్‌లో 8వ తరగతి చదువుతున్నాడు.

యాదాద్రిలో శరత్ పౌర్ణమి వేడుకలు


శ్రీస్వామి అమ్మవార్ల సేవకు ముందు ప్రబంధ పారాయణం చేస్తున్న అర్చకులు


ఈఓ కు చెక్కు అందజేస్తున్న సుధీర్‌రెడ్డి

యాదగిరిగుట్ట: యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయంలో గురువారం శరత్ పౌర్ణమిని పురస్కరించుకొని ఆచార్యులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. శ్రీస్వామి అమ్మవార్లను విశేషంగా అలంకరించి ప్రత్యేక సేవను ఊరేగించారు. అనంతరం ఆలయ మండపంలో శ్రీస్వామి అమ్మవార్లను వేంచేపు చేయించి, వేద మంత్రాలతో పూజించి, ప్రబంధ పారాయణం చేశారు. విశేష ప్రసాదాన్ని ఆరగింపుగా చేసి పెట్టారు.

స్వర్ణ తాపడానికి రూ.10లక్షల విరాళం

యాదాద్రి లక్ష్మీనరసింహస్వామి ఆలయ విమాన గోపురానికి స్వర్ణ తాపడం కోసం హైదరాబాద్‌లోని సైదాబాద్‌కు చెందిన కంకర్ సుధీర్‌రెడ్డి రూ.10లక్షలు విరాళంగా అందజేశారు. గురువారం యాదాద్రీశుడిని దర్శించుకున్న ఆయన ఈఓ భాస్కర్‌రావును కలిసి రూ.10లక్షల చెక్కును అందజేశారు.

యాదాద్రిని అద్భుతంగా తీర్చిదిద్దారు

యాదాద్రి లక్ష్మీనరసింహస్వామి ఆలయాన్ని మాజీ సీఎం కేసీఆర్ అద్భుతంగా తీర్చిదిద్దారని సినీ నటుడు సుమన్ అన్నారు. యాదాద్రీశుడిని గురువారం ఆయన కుటుంబ సభ్యులతో కలిసి దర్శించుకున్నారు. గర్భాలయంలోని స్వయంభూ, ప్రతిష్ఠా అలంకార మూర్తులను దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించిన తర్వాత అర్చకులు ఆయనకు వేద ఆశీర్వచనం చేశారు.

స్వర్ణగిరిని దర్శించుకున్న సుమన్

భువనగిరి: పట్టణ శివారులోని స్వర్ణగిరి శ్రీవెంకటేశ్వరస్వామి ఆలయాన్ని కూడా సినీ నటుడు సుమన్ దర్శించుకున్నారు. ఆలయ అర్చకులు ఆయన స్వాగతం పలికారు.

20 క్వింటాళ్ల రేషన్ బియ్యం స్వాధీనం

మునగాల: మండల పరిధిలోని బరాఖత్ గూడెం గ్రామ పంచాయతీలోని ఎస్సీ కాలనీకి చెందిన జిల్లేపల్లి శ్రీను ఇంట్లో అక్రమంగా నిల్వ ఉంచిన 20 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని గురువారం పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ప్రభుత్వ రేషన్ లబ్ధిదారులకు పంపిణీ చేసిన బియ్యాన్ని జిల్లేపల్లి శ్రీను తక్కువ ధరకు కొనుగోలు చేసి బయట మార్కెట్‌లో ఎక్కువ ధరకు అమ్ముతున్నట్లు విశ్వసనీయ సమాచారం అందడంతో అతడి ఇంటిపై దాడి చేసి ఇంట్లో నిల్వ ఉంచిన 20 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ బి. ప్రవీణ్‌కుమార్ తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు.